ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ఆరవ శతకము ప్రథమస్తబకము)

## ఏకవింశ స్తబకము

**అవ:-** ఇరువది యొకటవస్తబకమున – పరమేశ్వరు నర్ధాంగమగు పార్వతి యొక్క స్తుతి – కావింపఁబడుచున్నది.

మూ॥ ఇతఃపీత్వాకుచం స్కన్దే ప్రసారితకరే తతః
జయతి స్మిత ముద్భూతం శివయోరేకదేహయోః॥ 1

శిశువగు సుబ్రహ్మణ్యుఁడు, ఈవలనున్నకు చమునుద్రావి ఆవలి ప్రక్కకు తనహస్తములను చాపునపుడు – ఏకదేహులగు శివుల కొదవిన మందస్మితము - సర్వోత్కృష్టమై వెలయుచున్నది.

**ప్రభ:-** సుబ్రహ్మణ్యుఁడు = స్కందుఁడు – కుమారస్వామి. ఏకదేహులు= ఒకే శరీరము గలవారు. శివులు = శివయగు పార్వతియు, శివుఁడగు పరమేశ్వరుఁడును, స్తనంధయుఁడగు కుమారుఁడు – వామ భాగమునందలి స్తన్యమును త్రాగి – తల్లియొక్క దక్షిణ కుచమును స్తన్యమునకై గ్రహించుటకు హస్తములను ప్రసరింపఁజేయుచున్నాడు. తండ్రియగు శివుఁడు తల్లియొక్క దక్షిణభాగమ్మైయున్నాఁడు. అక్కడ కుచమెక్కడిది? ఆ యంశము నీ శిశువెట్లెఱుఁగును? తల్లిదండ్రు లేక దేహులని స్తన్యపాయికి తెలియదుగదా! ఒక కుచమును త్రాగిన పిదప వేఱొక కుచమును ద్రావుటకు చేయిచాచుట శిశువులకు స్వభావము చేతనే కలుగును. తమకు జనించిన బిడ్డయొక్క యీయవస్థ వీక్షించిన తల్లిదండ్రులకు పుత్రవిషయమగు రతి – చిరునవ్వుచేత ప్రకాశింపఁజేయఁబడు చున్నది.



ఇచట అలంబన విభావము స్కందుఁడు, ఉద్దీపనవిభావము – స్తన్యపానము. అనుభావము – దక్షిణ స్తనము కొఱకయిన కరప్రసారణము, సంచారి భావము – హర్షాదికము. ఇట్లు – విభావ – అనుభావ – సంచారిభావ సంయోగము వలన పుత్రవిషయమగు రతి – అభివ్యక్తమగుచున్నది. ఇచట తల్లిదండ్రు లేక దేహులగుటవలన కుమారుని హస్తప్రసారణమునకుఁ గలిగిన వైఫల్యము వలన స్థాయి భావమగు హాసము – ధ్వనింపఁజేయఁబడుచున్నది. అయినను అది వ్యభిచారిత్వమునే భజించి పుత్ర విషయమగు రతినే పరిపోషించును. 'రత్యాదయోఽప్యనియతే రసేస్యుర్వ్యభిచారిణః'' ''అనియతమగు రసమున – స్థాయి భావములగు రత్యాదులు కూడ – వ్యభిచారులగును'' అను లక్షణము వలన స్థాయి భావమగు హాసముకూడ నిచట వ్యభిచారియగుట విరుద్ధము కానేరదు. పుత్ర విషయరతియగు శృంగారమిచ్చుట ఉచ్ఛేదింపఁదగినది కాదు. కావున నిచట రతియే స్థాయిభావమని గ్రహింపవలయును. ఉత్తములకొదవు హాసము – అల్పమై యుండును. ఉత్తములకు – స్మిత – హసితములును, మధ్యములకు – విహసిత - అవహసితములును, నీచులకు – అపహసితమును కలుగునని దర్పణకర్త చెప్పియున్నాఁడు. ఇచట జగజ్జనకులగు శివులకు (శివాశివులకు) సముచితమగునుత్తమ హసితము. స్మితపదము చేతఁ జెప్పఁబడినది.

అపత్యము చేత ఫలించిన అపూర్వదాంపత్య సంపదగల పరదేవతలు విషయముగాఁగల కవిగత మగు రతిభావము (భక్తి) కూడ నిచట ధ్వనించుచున్నది. దీనికి – ఆలంబనము – ఏతన్మూలమున ప్రతిపాద్యమగునర్థము. అనుభావము - శ్లోకప్రయోగము. 'జయతి' అనుదానిచేత నమస్కారము నెట్లో లాగికొనవచ్చును, స్వభావోక్త్యలంకారము – స్పష్టమైయున్నది. ''స్వభావోక్తిస్తు డిమ్భాదేః స్వక్రియారూపవర్ణనమ్'' అనునది లక్షణము.

**అవ:-** క్రింది శ్లోకము నుండి పదునేడవ శ్లోకము వఱకును గల యర్థము - ఏకవాక్యమైయున్నది.

మూ॥ ఏకతోమణిమఞ్జీర క్వాణాహూతసితచ్ఛదమ్
అన్యతోనూపురాహీన్ద్రఫూత్కారకృతతద్ భయమ్॥ 2

ఒకవంక (వామార్థమున) మణిఖచితములగు మంజీరముల యొక్క నాదము చేత ఆహూతములగు హంసములు గలది. (వామార్థము) ఇంకొకప్రక్క – (దక్షిణార్థమున) నూపురమగు సర్పరాజు యొక్క ఫూత్కారము చేత వానికి (హంసలకు) భయమును గలిగించునది. (దక్షిణార్థము).

**ప్రభ:-** పదునేడవ శ్లోకమునందుఁ జెప్పఁబడిన, రామాపుమాకారము అనగా స్త్రీ పురుషుల యాకారమువంటి ఆకారముగల ఏక స్వరూపము. దీనియందును – తరువాతి శ్లోకముల యందును ప్రస్తుతింపఁబడుచున్నది. ఒకవంక రత్న ఖచితములగు పాదకటకముల ధ్వని చేత హంసలు పిలువఁబడుచున్నవి. వేరొకవంక, పాద భూషణమగు నాగుపాము బుసకొట్టుటచేత నాహంసలు భయపడుచున్నవి. అని భావము. ' ఒకవంక' అని యిందు చెప్పఁబడిన వామభాగము– స్త్రీ రూపమనియు, ' ఇంకొకప్రక్క' అని యిందు చెప్పఁబడిన దక్షిణభాగము– పురుష రూపమనియు గ్రహించునది. ఇందు మొదటిది సౌమ్యదర్శనము. రెండవది రౌద్రదర్శనము, ఈ భంగ్యంతరము నాశ్రయించి, వామ–దక్షిణార్థములు గల పార్వతీ పరమేశ్వరులి చటవ్యంజింపఁజేఁబడుచున్నారు. కావున ''చెప్పఁగోరిన యర్థమును, వేరొకభంగినాశ్రయించి ప్రతిపాదించుట-పర్యాయోక్తము'' అను రసగంగాధరకర్త జగన్నాధపండిత రాజమతము ననుసరించి యిది పర్యాయోక్తాలంకార మగుచున్నది. ఇది యుక్తమగు నభిమతమైయున్నది. ఈ యలంకారమున వ్యంగ్యము, వాచ్యపరమగుచున్నది. కావున నిది - వాచ్యసిద్ధ్యంగమగు గుణీభూత వ్యంగ్యభేదమగునని ధ్వనికారానుయాయులు చెప్పుదురు.

ఇక్కడనుండి పదునారవ శ్లోకము వఱకును గల పద్యములన్నింటను పర్యాయోక్తమే యలంకారమగుచున్నది.



పదునేడవ శ్లోకమున ''వస్తుమేహృది సన్నిదధాతు'' ''స్త్రీపురుషాకారమగు వస్తువు నా హృదయమున నివసించుఁగాత'' అని వాక్యము సమాప్తము చేయఁబడినది.

మూ॥ గీర్వాణపృతనాపాలం బాలం లాలయ దేకతః।
ఉత్సఙ్గే గణసమ్రాజమర్భకం బిభ్రదన్యతః॥ 3

ఒకదెస (సవ్యభాగమున) దేవసేనాపతికాగల కుమారుని (స్కందుని) ఆడించునది, వేరొకదెస (అపసవ్యభాగమున) గణములకు సమ్రాట్టుకాఁగల బాలుని – అంకమున ధరించునది, అగు (స్త్రీ పురుషాకారమగు వస్తువు నా హృదయమున నివసించుగాత!)

**ప్రభ:-** ఎడమప్రక్కను సుబ్రహ్మణ్యు నాడించునది – కుడి ప్రక్కను గణపతిని ధరించునది. అని చెప్పుటవలన తల్లిచేతలాలింపఁబడు కుమారుఁడు శక్తి యొక్క అండమధికముగాఁ గలవాడును– కావుననే శక్తిధరుఁడును, గణపతికంటె చిన్నవాఁడును, అగుననునర్థము నిశ్చయింపఁదగియున్నది. అట్లే తండ్రిచేత నుత్సంగమునందుంచుకొని లాలింపఁబడుచున్న ఓంకారవదనుఁడగు గణపతి– అధికమగు శివాంశము గలవాఁడును, జ్యేష్ఠుఁడును, అగుననునర్థము నిశ్చయింపఁదగియున్నది.

మూ॥ విడమ్బిత బ్రహ్మచారి కోకైక స్తనమేకతః।
కవాటార్ధనిభం బిభ్రద్వక్షః కేవల మన్యతః॥ 4

ఒకవంక (వామభాగమున బ్రహ్మచారి (భార్యలేనిది) యగు చక్రవాకము ననుకరించు ఒకేస్తనము గలది – వేఱొకవంక (దక్షిణ భాగమున కవాటార్ధ సదృశమును, కేవలమును, (వక్షోజరహితమును) అగు వక్షస్స్థలముగలది.

ప్రభ:- చక్రవాక మిథునమును స్తనయుగళముతో; బోల్చుట సుప్రసిద్ధమైయున్నది. కావున, దక్షిణార్థమునందలి కుచములేని వామ భాగమునందలి కుచముతో, బ్రహ్మచారియగు చక్రవాకముపమింపఁ బడినది. దక్షిణ భాగమునందేమున్నది? అను ప్రశ్నకు ప్రత్యుత్తరముగా ''అచట కవాటము యొక్క అర్థభాగము వలెనున్న కేవలమగు వక్షస్థలమే యున్నది'' అని చెప్పఁబడినది. ఇట్లు భిన్నమగు రూపముగల పార్వతీ పరమేశ్వరీ వస్తువు - నా హృదయమున నివసించుఁగాతమని పదునేడవ శ్లోకముతో నన్వయించునది.

మూ॥ సేనాన్యాస్వాదితస్తన్య మనుపూత్ కుర్వతైకతః।
పూత్కారముఖరం నాగముగ్రం జాగ్రతమన్యతః॥ 5

ఒకభాగమున, అనుసరించి పూత్కారము నొనర్చుచున్న స్కందునిచేత నాస్వాదింపఁబడుచున్న స్తన్యము గలది. వేఱొకభాగమున శ్వసితపూత్కారముచే శబ్దాయామానమగుచున్న ఉగ్రమును అనిద్రితమును, అగు సర్పమును భరించునది.

మూ॥ ఏకతోదోర్లతాంబిభ్రత్ మృణాళ శ్రీ విడమ్బినీమ్।
శుక్రశుణ్డాలశుణ్డాభంచణ్డం దోర్దణ్డమన్యతః॥ 6

వామభాగమున పద్మనాళశోభనపహసించు భుజలతను భరించునది - దక్షిణ భాగమున నైరావతము యొక్క తుండముతో సదృశమగు ప్రచండ బాహు దండమును భరించునది.

మూ॥ కుత్రాప్యవిద్యమానేఽపి వన్దనీయే తదాతదా
పరస్పర కరస్పర్శలోభతో విహితాఞ్జలి॥ 7

(పార్వతీ పరమేశ్వరుల చేత) వందనీయమగు వస్తువేదియు లేకున్నను అప్పుడప్పుడు - ఒండొరుల హస్తములను స్పృశించుట యందలి లోభము వలన విహితమగు అంజలిగలది. (హస్తద్వయ సంయోగరూపమగు నమస్కారము గలది.)



ప్రభ:- వామహస్తమును - దక్షిణహస్తమును - అన్యోన్య స్పర్శసుఖము నందలి కోరికచేత మిళితములయినవని భావము. పరమేశ్వర వస్తుసంబంధియగు వామార్ధ దక్షిణార్ధద్వయము - స్వర్గలోక వందనీయము. తదీయకర సంయోగరూపమగు అంజలిబంధము. దుష్కర విషయము. కావున సమర్థనము నపేక్షించుచున్నది. ''పరస్పర స్పర్శలోభము చేత'' అను పదార్థగత హేతువు చేత - ఆ యంజలి బంధము సమర్థింపఁబడినది. కావున ''హేతోర్వాక్య-పదార్థత్వే కావ్యలిఙ్గముదాహృతమ్'' అను లక్షణము వలన నిది కావ్యలింగాలంకార మగుచున్నది.

మూ॥ శక్రనీలసవర్ణత్వాద్ భాగయోరుభయోరపి।
ఊర్ధ్వాధరాఙ్గసాపేక్ష సన్ధిజ్ఞానగలస్థలమ్॥ 8

ఆ - వామ- దక్షిణభాగములు - రెండునుగూడ కంఠ ప్రదేశములందు ఇంద్రనీలముతో సమానమగు రంగుగలవి. కావున - తత్ కంఠస్థలము యొక్క సంధిజ్ఞానము - ఊర్ధ్వాధరాంగ - సాపేక్షము. అట్టి గళ స్థలము గలదియగు వస్తువు నా హృదయమునందు నివసించుగాత!

ప్రభ:- కాలియగు దేవి - నీలవర్ణము గలది. కావున వామభాగమునందలి కాళీమాతకంఠము - ఇంద్రనీలము వంటిరంగు గలది (యగుచున్నది) శివుఁడు-శ్వేత వర్ణము గలవాఁడు. అయినను విషపానము చేత దక్షిణభాగమునందున్న యతనికంఠము కూడ ఇంద్రనీలము వంటి రంగుగలదియే యగుచున్నది. ఇట్లు కంఠమంతయు నీలవర్ణమగుచుండునపుడు '' ఇది పార్వతి కంఠభాగము - ఇది శివుని కంఠభాగము'' అని యెట్లు తెలియును? అని యాశంకించి, ఉత్తరార్థము చేత సమాధానము చెప్పఁబడుచున్నది. దక్షిణభాగమునందలి శివుని కంఠము మీఁది తెల్లదనమును, కంఠము క్రింది తెల్లఁదనమును పరిశీలించి - పార్వతీ - పరమేశ్వరుల కంఠముల యొక్క సంధినెఱుఁగవలయును. ఇట్లు పరమేశ్వరుని - ఊర్ధ్వ - అధర- శరీరముల పరీక్షవలన తెలియదగిన సంధిజ్ఞానము గల గళస్థలము గల - వస్తువు నాహృదయమున నివసించుఁగాతమని పదునేడవ శ్లోకార్థముతో నన్వయించునది.

మూ॥ ఏకతః కైరవ శ్రేణీ నిద్రామోచన లోచనమ్
అన్యతః కమలావాస క్షణాధాయక వీక్షణమ్॥ 9

వామభాగమున – నిద్రించుచున్న కలువపూవు మొత్తములను మేల్కొల్పు నేత్రము గలది. దక్షిణభాగమున – లక్ష్మీ నిలయమగు కమలమున కుత్సవమును గలిగించు నేత్రము గలది.

**ప్రభ:-** పరమేశ్వరుని వామనేత్రము – చంద్రుఁడనియు, దక్షిణ నేత్రము సూర్యుఁడనియుఁ జెప్పుట ప్రసిద్ధమై యున్నది. కలువలను వికసింపఁజేయు చంద్రుడను నేత్రముగల పార్వతియు, కమలములను వికసింపఁజేయు సూర్యుఁడను నేత్రము గల పరమేశ్వరుఁడును, ఏకస్వరూపులై యొకేవస్తువగుచున్నారు. ఆ వస్తువు నా హృదయమున నివసించుఁగాతమని తాత్పర్యము.

మూ॥ ఏకతశ్చక్షుషా చారుతోరణాధీత విభ్రమమ్।
అన్యతః పాణిపాథోజే ఖేలతో మృగబాలతః॥ 10

వామభాగమున – సుందరమగు కనీనిక (కంటిపాప) గల నేత్రము చేతను, దక్షిణభాగమున – హస్తకమలమున క్రీడించుచున్న బాలహరిణము చేతను, నేర్చుకొనఁబడుచున్న విభ్రమము (విలాసము) గలది.

**ప్రభ:-** చక్కని కంటిపాపగల పార్వతి నేత్రము– శివుని కరకమలమునందున్న బాలహరిణము యొక్క దృష్టియందలి విలాసమును, శివుని చేతియందాడుకొనుచున్న బాలహరిణము యొక్క నేత్రము– పార్వతి యొక్క దృష్టియందలి విలాసమును నేర్చుకొనుచున్నదని భావము.

మూ॥ ఏకతో భాలఫలకే కాశ్మీరేణ విశేషితమ్।
అన్యతో౽ర్ధేక్షణేనైవ రతిభ్రూవిభ్రమద్రుహా॥ 11



వామ పార్శ్వమున– ఫలకము వంటి లలాటమున – కాశ్మీర దేశమునందుద్భవించిన సుగంధ ద్రవ్యముచేత నలంకరింపఁబడినది దక్షిణ వామపార్శ్వమున– మన్మథకాంతయగు రతియొక భ్రూవిలాసమును దహించినదియగు అర్ధదృష్టి చేతనే అలంకరింపఁబడినది.

**ప్రభ:-**మూలమునందు ప్రయోగింపఁబడిన కాశ్మీరపదము చేత – కాశ్మీర దేశమునందుదయించిన కుంకుమపూవు పొడి అర్థమగుచున్నది. మన్మథుని దహించిన తృతీయమగు అగ్ని నేత్రము యొక్క అర్ధభాగమే – దక్షిణమునందలి శివభాగమున మిగిలియుండెను. ఆయర్ధ నేత్రము చేతనే యాభాగమలంకరింపఁబడినది. ''అర్ధదృష్టిచేతనే'' అనుటచేత పూర్ణమగు నేత్రము - రతికాంతుని దహించుట కావశ్యకము గాకపోయెనని భావము.

మూ॥ ఏకతః శీతలాలోకం సాధులోకశివఙ్కరమ్
అన్యతః ప్రజ్వలత్ ప్రేక్షం దుష్టగోష్ఠీ భయఙ్కరమ్॥ 12

వామార్ధమున – శీతలాలోకము గలది – సజ్జన సంఘమునకు క్షేమమును గలిగించునది. దక్షిణార్ధమున – దుర్జన సంఘమునకు భీతి గలిగించునది ప్రజ్వలించుచున్న దృష్టి గలది.

మూ॥ ఏకతో మణితాటఙ్క ప్రభాధౌత కపోలకమ్
అన్యతః కుణ్డలీభూత కుణ్డలీభూత కుణ్డలీ॥ 13

ఒకప్రక్క – మణిఖచితమగు కర్ణభూషణము యొక్క ప్రభచేత తెల్లనయిన కపోలము గలది – ఇంకొక్కప్రక్క – కుండలీభూతమును కుండలీ భూతమును అగు కుండలిగలది.

ప్రభ:- మణితాటంక శోభచేత ధౌతమగు కపోలము గల వామభాగమును, కుండలము (మండలా కారము) కాకున్నను, కుండలముగా (మండలా కారముగా) చేయఁబడి, కుండలముగా (చెవియందలి భూషణముగా) చేయఁబడిన, కుండలి (సర్పము) గల దక్షిణభాగమును గల వస్తువు - నా హృదయమున నివసించుఁగాతమని పదునేడవ శ్లోకముతో నన్వయము. కుండలియనఁగా పాము- తిన్నని దీర్ఘరూపముగల చుట్టగాచుట్టబడి (కుండలీ భూతమై) కుండలముగాఁ జేయఁబడినదని (కుండలీ భూతమయినదని) గ్రహించునది.

మూ॥ ఏకతః కున్తలాన్ బిభ్రదిన్ద్ర నీలోపమద్యుతీన్।
అన్యతః పావకజ్వాలా పాటలాంశుచ్ఛటాజటాః॥ 14

ఒక దెస- ఇంద్రనీల సదృశకాంతులగు కుంతలములను భరించునది. ఇంకొకదెస - అగ్నిజ్వాలల యొక్క శ్వేతరక్తకాంతి రేఖలు గల జటలను వహించునది.

మూ॥ ఏకతః కేశపా శేన కీర్ణేనోరసి భాసురమ్।
అన్యతో లమ్బమానస్య భోగినో హారతాశ్రియమ్॥ 15

కుడిప్రక్క హారముగాఁ జేయబడి వ్రేలాడుచున్న సర్పము యొక్క శోభన సహరించుచు - ఎడమ ప్రక్కను గల వక్షస్థలమున చెదరియున్న కేశపాశము చేత భాసురమగు వస్తువు నా హృదయమున నివసించుఁగాత!

ప్రభ:- వామపక్షమున కీర్ణమగు దేవీ కాల కేశపాశము - శివుని హారమగు సర్పము యొక్క శోభ నతిశయించుచున్నదని భావము.

మూ॥ అవతం సితమమ్లాన పారిజాతస్రజైకతః
విమలోల్లోలమాలిన్యా విబుధాపగయాన్యతః॥ 16



స్త్రీ భాగమున నూతనమగు పారిజాత పుష్పమాల చేత అవతంసితము (అలంకృతము) పురుషభాగమున - విమలములగు మహోతరంగముల యొక్క పంక్తిగల దేవనదియగు గంగచేత అవతంసితము. (అలంకృతము)

ప్రభ:- వామ శీర్షభాగమున నవపారిజాత పుష్పమాలయు, దక్షిణశీర్ష భాగమున గంగానదియు, భూషణములుగాఁ జేయఁబడిన వస్తువు - నా హృదయము నివసించుఁగాత!

మూ॥ రౌప్యాచలకృతావాసం ప్రాప్యం యుక్తేన చేతసా।
వస్తురామాపుమాకారం హృదిసన్నిదధాతుమే॥ 17

రజతాద్రియందు (వెండికొండయందు) నివసించునదియు, యోగాభ్యాసము గల మనస్సు చేత తెలియఁదగినదియు, స్త్రీ-పురుషస్వరూపము గలదియునగు వస్తువు - నాహృదయమున నివసించుఁగాత! (హృదయమున సాన్నిధ్యము నొసఁగుఁగాత) 2వ శ్లోకమునుండియు - తెలుపఁబడిన యర్థమంతయుఁగూడ - స్త్రీ పురుషాకారము గలదియగు వస్తువు నా హృదయమున నివసించుగాత! అను పదునేడవ శ్లోకమునందలి యంతిమార్థముతోఁ గూర్చి సమన్వయించుకొనవలయును.

మూ॥ కాన్తార్థ విగ్రహేమాత ర్జటార్ధా శ్చికురాస్తవ।
దధత్యదభ్ర సన్ధ్యాభ్ర యుక్త కాలాభ్ర విభ్రమమ్॥ 18

కాంతార్థ విగ్రహవగు జననీ! (పతియొక్క అర్ధ శరీరమవగు తల్లీ!) శివుని జటా భాగమునకు సమమగు భాగముగలనీ చికురములు - సంధ్యాకాలము నందలి యాకాశముతోఁ గూడియున్న శ్యామల జలదముల విభ్రమమును - ధరించుచుండును.

ప్రభ:- శివుని జటలు – సంధ్యా కాలమునందలి యాకాశమువలె జేగురు రంగు గలిగియుండును. ఆజటలకు వామ భాగమున సగపాలయున్న నీవినీల శిరోజములు – సంధ్యా కాలమునందలి యాకాశముతోఁగూడిన నీల మేఘముల విలాసము వంటి విలాసమును వహించుచుండునని భావము. ఇక్కడ - చికురవములు– కాలమేఘములుగా నారోపింపఁబడినవి. కావున నిందలి యలంకారము నిదర్శనమగుచున్నది.

మూ॥ దమ్పత్యోర్యువయో రేషలోపో యన్నా స్తిశైలజే।
వామం పార్శ్వం విభో శ్శేతుం దాతుంతే దక్షిణః కరః॥ 19

పార్వతీ! నీవిభుఁడగు శివునికి శయనించుటకు వామపార్శ్వము లేదు. నీకు – దానమొనర్చుటకు దక్షిణహస్తము లేదు. మీదంపతులకుఁ గలలోపమిదియే.

ప్రభ:- వామ పార్శ్వము – నీచేత నపహరింపఁబడుట వలన శివునకు శయ నించుటకు వామ పార్శ్వమును, శివార్ధము నందుండుట వలన నీకు దక్షిణకరమును లేకుండుటయే మీ యిరువురికిని గల లోపమని భావము. మీఁది కారణమువలననే దేవీ వామహస్తము – దానమునందు ప్రసిద్ధమునునంశమును, తనకు తానే యాశ్రయుఁడగుట వలన శివుఁడు, పార్శ్వము నపూశింపఁడను నంశమును గమ్యమగుచున్నది. కావుననిది – గమ్యమగు హేతూత్ప్రేక్షాలంకారమగుచున్నది.

మూ॥ లోకే స్త్రీస్తనయుగ్మేన పుష్ణాత్యేకం సుతం నవా
స్తనేనైకేన శర్వాణి! పుష్ణాసిత్వం జగత్ త్రయమ్॥ 20

లోకమునందొక స్త్రీ – స్తనయుగ్మము చేత – ఒకపుత్రుని పోషించునో లేదో, సంశయింప వలసియున్నది. శర్వాణీ! నీవు – ఒకే స్తనము చేత జగత్త్రయమును పోషించుచున్నావు.



ప్రభ:- నిస్సంశయుముగా నేకస్తనము చేతనే ముల్లోకములను పోషించుచుండుట వలన నీ మహిమ యద్భుతమని భావము.

మూ॥ ఖిద్యన్తి యోషితః కుక్షౌ వహన్త్యోర్భకమేకకమ్।
అర్ధకుక్షౌ దధాసిత్వం త్రిలోకీమమ్బ! లీలయా॥ 21

అమ్మా! స్త్రీలు – తమ సంపూర్ణ కుక్షియందు – శిశువునొక్కనినే వహించును ఖేదము నొందుచున్నారు. అట్లుగాక నీవు – అర్ధకుక్షియందు – ముల్లోకములను – అనాయాసముగా ధరించుచున్నావు.

ప్రభ:- కుక్షియం దర్ధభాగము – శివునికి సంబంధించినది. కావున పార్వతి– తన వామార్ధము నందే ముల్లోకములను ధరించుట కుదురుచున్నది.

మూ॥ అనురూపా శివస్యత్వ మనురూపః శివస్తవ।
అలఙ్కారోఽను రూపో వామలఙ్కారోఽప్యకః శశీ॥22

నీవు – శివునకు తగినదానవు., శివుఁడు నీకు తగినవాఁడు కలంకరహితుఁడగు బాలచంద్రుఁడు. మీఁద్దఱుకును తగినయలంకారము.

ప్రభ:- ప్రసిద్ధుఁడగు చంద్రునికంటె నతిరిక్తుఁడగు బాలచంద్రుఁడు – మీకనురూపమగు నలంకారము. పూర్వార్ధమునందలి యలంకారము – అన్యోన్యము. ఉత్తరార్ధమునందలి యలంకారము. సమము.

మూ॥ తవైవ తవ దేహాంశో హరస్యైవహరస్య యః।
ప్రాణాస్తు జగతాం ధాత్రి! హరస్యత్వం హరస్తవ॥ 23

నీ దేహాంశము – నీదే. హరుని దేహ భాగము – హరునిదే. అయినను ఓలోకభర్త్రీ! హరునకు నీవు ప్రాణములు. హరుఁడు నీకు ప్రాణములు.

ప్రభ:- వామ భాగమగు నీ శరీరాంశమున శివునికి స్వామ్యము లేదు. దక్షిణ భాగమగు శివశరీరాంశమున నీకు స్వామ్యము లేదు. ఇట్లు మీయుభయుల శరీర భాగములును విభక్తములైయున్నను, మీరొకరికొకరు ప్రాణములై యున్నారు. అని భావము. ఇచ్చటఁగలది – అన్యోన్యాలంకారము.

మూ॥ అవిభక్తం భవాని! స్వం భవస్య తవచోభయోః।
సకృత్ సకరుణం చేతః సఙ్కల్పయతు నశ్శివమ్॥ 24

భవానీ! భవునకును నీకును – ఉభయులకును విభక్తము కాని (ఏకమైయున్న) సకరుణమగు మనస్సు మాయొక్క కల్యాణము నొక్కమారు సంకల్పించుఁగాత!

ప్రభ:- మీ శరీరము – విభక్తము. ప్రాణములు నీవు- శివునకు, శివుఁడు- నీకు, కాని మనస్సొక్కటే, అమనస్సంకల్పము – అమోఘ- సద్యః ఫలదాయకమగుట చేత- ఒక్కమారే కోరఁబడినది.

మూ॥ భవస్య భాగముత్సృజ్యభవానీ భాగమాత్మనః।
భజత్వనుష్టు భామాసాం సృష్టానాం నారసింహినా॥ 25

భవానియగు దేవి – నరసింహ పుత్రుఁడును, కవియునగు గణపతి చేత నిర్మింపఁబడి- సమర్పింపఁబడిన అనుష్టుప్ కృతులలో భవుని భాగమును భవునకు విడిచి, (ఆత్మ) తన భాగమును తాను స్వీకరించుఁగాత!

ప్రభ:- భవుని భాగమునఁగా; శివవర్ణనపరమగు పద్యభాగము

ఇది – స్వ్యాఖ్యమగు ఇరువది యొకటవ స్తబకము.

****



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ఆరవ శతకము ద్వితీయస్తబకము)

## ద్వావింశ స్తబకము

అవ:- ఇరువది రెండవదియగు నీ స్తబకమున కైలాసనాధుని ప్రభావము వర్ణింపఁబడునపుడు తత్కాంతా సౌభాగ్యమును, వర్ణింపఁబడుచున్నది. మఱియు శివకుటుంబకము కీర్తింపఁబడును. స్తబక ప్రారంభమున వెనుకటివలెనే హసితము స్తుతింపఁబడుచున్నది.

మూ॥ అఖిలస్య వికాసకారణమ్
వ్యసని జ్ఞానిజనావనేషునః।
వితనోతు విశేషతః శివం
శివరాజీవదృశో దరస్మితమ్॥ 1

సర్వమునకును ఉన్మీలన హేతుభూతమును, జ్ఞానులగు మనుష్యులను పాలించుటయందు వ్యసనము గలదియు, అగు శివసుందరి యొక్క మందస్మితము- మాకుమంగళము నిచ్చుఁగాత!

ప్రభ:- వ్యసనమను పదము కామమువలనఁ గలిగిన దోషమున వర్తించును. అయినను జ్ఞానులయందుఁగల వాత్సల్యాతిశయమును ప్రదర్శించుట కిచట ప్రయోగింపఁబడినది. దేవీ మందస్మితము. తన్ముఖము నందు వికసించును. దాని చేత నీ విశ్వము మేల్కొనును. ఆ మందస్మితము – ఉజ్జ్వలము. కావున ప్రకాశపాలనము దానికి స్వాభావికమగును. కావుననే అబోధమున కంతకును ప్రబోధమును కలిగించునదియు, ప్రబోధము నొందిన జనము యొక్క బోధమును రక్షించునదియు నగును. కావున నిట్లు అప్రాప్తలాభరూపమగు యోగమును, ప్రాప్త